

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

కడప జిల్లా కేంద్రంగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో అండర్ 17 విభాగంలో ఉమ్మడి విజయనగరం జిల్లా జట్టుకు ప్రాధాన్యత వహించిన పార్వతీపురం మండలం డోకిశిలా గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రవీణ్ జట్టు బంగారు పతకం సాధించింది. జట్టులో విశేష ప్రతిభ కనబరిచిన ప్రవీణ్ కుమార్ ఆట తీరుకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు లభించాయి. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి ప్రవీణ్‌ను ప్రధాన ఉపాధ్యాయులు గోవిందరావు, పీడీ మంతెన వాసుదేవరావు, పిఇటి దుర్గాప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సమ సమాజానికి నడుం బిగించాలి

- చే గువేరాకు విద్యార్థులు నివాళి
- 8వ రోజుకు చేరిన ఎస్‌ఎఫ్ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - కురుపాం

చే గువేరా స్ఫూర్తితో సమసమాజం కోసం యువత నడుంబిగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ తలపెట్టిన సంగ్రామ సైకిల్ యాత్ర సోమవారం చినమేరంగి, తోటపల్లి, ఉల్లిభద్ర పాఠశాలలను, సంక్షేమ హాస్టళ్లలో పర్యటించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తోటపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చేగువేరా 56వ వర్ధంతి సందర్భంగా చే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండు, రాజశేఖర్ మాట్లాడుతూ విప్లవ భావజాలపు యువతకు చే గువేరా ఓ యూత్ ఐకానని, అన్యాయాలకు, దోపిడీలకు సరిహద్దుల్లేవని, అలానే వాటి అంతం కొరకు పోరాడే విప్లవకారులకు సరిహద్దులు ఉండ కూడదని చాటిన గొప్ప విప్లవకారుడు చే అని అన్నారు. వ్యక్తికి పట్టిన వైరస్‌ను చంపడం కన్నా సమాజానికి పట్టిన వైరస్‌ను చంపడం మిన్న అని భావించి తన డాక్టర్ వృత్తిని వదిలి విప్లవోద్యమంలో చేరిన విప్లవ జ్యోతి చేగువేరానని తెలిపారు. సమాజంలో వస్తున్న రుగ్మతలకు వ్యతిరేకంగా యువత రాజకీయాల్లోకి రావాలని, నేటి సమాజంలో మహిళల పట్ల చిన్న చూపు, పేద, ధనిక అనే తేడా కొనసాగుతూనే ఉందని మండిపడ్డారు. మతోన్మాద పాలనలో సమాజం నిండిపోతుందని, కులం, మతం లేని సమసమాజం కోసం యువత నడుం బిగించాలని కోరారు. చే గువేరా కోరుకున్న సమాజం కోసం చైతన్యపు కెరటం కావాలని, యువత ప్రతి విషయయాన్ని ప్రశ్నిస్తూ.. పయనిస్తూ చే వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలని అలా చేసినప్పుడే చే గువేరా వారసులౌతామని నినదించారు. శపథంతో ముందుకు సాగడమే చే గువేరాకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. చేగువేరా స్ఫూర్తితో విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర డిమాండ్ చేస్తున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, విద్యారంగంలో వస్తున్న అసమానతలు తొలగించాలని, విద్య కాషాయికరణను వ్యతిరేకిస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని చేపడుతున్న భవిష్యత్తు పోరాట కార్యక్రమాల్లో విద్యార్థులంతా పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాజు, హెచ్.సింహాచలం, కె.గంగారం, కె.భాస్కరరావు మరియు సైకిల్ యాత్ర బందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట: మండల కేంద్రంలో డివైఎఫ్ఐ నాయకులు టి నూకరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి శ్రీను, ఆటో కార్మిక సంఘం నాయకులు పిన్నింటి రంజిత్ కుమార్, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం చేగువేరా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ యువతకు చేగువేరా ఓ యూత్ ఐకాన్‌గా గుర్తింపు పొందారన్నారు. ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు పల్లి ధన, కాంత తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

త్వరితగతిన అభివృద్ధి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులను సమయస్ఫూర్తితో పూర్తి చేసి ప్రగతి సాధించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సాలూరు నియోజక వర్గంలోని గడపగడపకు మన ప్రభుత్వం కింద ప్రాధాన్యతా క్రమంలో మంజూరైన పనుల ప్రగతిపై సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సాలూరు మున్సిపాలిటీ, మక్కువ, పాచిపెంట మండలాల గ్రామ సచివాలయం పరిధిలోని మంజూరైన పనులు వివిధ దశల్లో ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడానికి గల కారణాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. బిల్లులు అప్లోడ్ చేయని కారణంగా చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. జిజిఎంపి పనులు బిల్లుల చెల్లింపులకు నిధులు పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాలో మరో రూ.11 కోట్ల వరకు అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఇంజనీరింగ్ సహాయకులు, ఇంజనీరింగ్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే పది రోజుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డ్వామా పిడి కె.రామచంద్రరావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ జిల్లా అధికారి ఓ.ప్రభాకర రావు, సాలూరు మున్సిపల్ కమిషనర్ టి.జయరామ్, సాలూరు, మక్కువ మండల ఇంజనీరింగ్ అధికారులు రజిత్, వరలక్ష్మి, డిఇలు శ్రీరామ్మూర్తి, డి.చిన్నంనాయుడు, ఎఇ ఎల్.సూరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఓటరు జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బెలగాం

ఓటరు జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. సాలూరు నియోజకవర్గ ఓటరు జాబితా సవరణ అంశంపై గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోజెక్టు అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ అంశాలు పెండింగ్‌లో ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారి నుండి ప్రతి స్థాయిలో అన్ని అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. పది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలు, ఓటర్లు లేని గృహాలు, వంద కంటే ఎక్కువ వయస్సు కలిగిన ఓటర్లు ఉన్న గృహాలు విధిగా పక్కాగా పరిశీలించాలని ఆదేశించారు. అందుతున్న ఫారాలు 7,8,9 పైనా శ్రద్ధ వహించాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సహాయ ఓటరు నమోదు అధికార్లు, తదితరులు పాల్గొన్నారు.



కొమరాడలో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

నేటికీ అందని రేషన్

అవస్థలు పడుతున్న గిరిజనం

తక్షణమే అందజేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న రేషన్ బియ్యం ఈనెల 10తేదీ కావస్తున్నా జిల్లాలో నేటికీ అనేక గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేయలేదు. దీంతో పేదలు అనేక అవస్థలుపడుతున్నారు. ప్రతినెలా ఒకటో నుంచి అందజేస్తున్న రేషన్ బియ్యం ఈనెల 10తేదీ కావస్తున్నా నేటికీ అందజేయకపోవడంతో లబ్ధిదారులు బియ్యం కోసం ఎదురు చేస్తున్నారు. ఈ మేరకు కొమరాడ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన లబ్ధిదారులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, ఎ.ఉపేంద్ర మాట్లాడుతూ నెలలో ఒకటో తారీకు నుండి 18వ తేదీ లోపు పూర్తిగా లబ్ధిదారులందరికీ వాహనం ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే ఈ నెల 9తేదీ పూర్తయినా మండల కేంద్రంలో సర్వర్ సమస్య వల్ల ఎవరికీ బియ్యం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమనే పరిస్థితి ఉందన్నారు. వెంటనే సర్వర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం ఎప్పుడు ఇస్తారనే విషయం వాలంటీర్ ద్వారా గానీ, సచివాలయం సిబ్బంది ద్వారా గానీ లబ్ధిదారులకు వెంటనే తెలియజేయాలన్నారు. దసరా సందర్భంగా కేరళ మాదిరిగా 18 రకాల నిత్యవసర వస్తువులు అందజేసి లబ్ధిదారులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో వినతులు పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుండి వచ్చిన వినతులను సత్వరమే పూర్తి స్థాయిలో పరిష్కరించి అర్జీదారుల సంతృప్తి స్థాయి పెంచాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని శాఖల వారీగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. సుమారు 200వరకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు అందించేందుకు జిల్లా కేంద్రానికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

పార్వతీపురం రూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి చక్కటి మార్గం స్పందన కార్యక్రమమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన తన కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో 9 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో దిశా డిఎస్‌పి ఎస్ఆర్ హర్షిత, ఎస్‌బి సిఐ సిహెచ్ లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకరరావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ స్పందనకు 63 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 63 వినతులొచ్చాయి. పిఒ కల్పనాకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వీకరించిన వినతుల్లో కొన్ని... సిరియా కండి చెందిన ఢిల్లేశ్వరరావు వృద్ధాప్య పెన్షన్, చిన్నగుమ్మడ చెందిన భీమారావు ఆటోలోనూ కోసం, కిరపకు చెందిన శ్రావణి కుట్టు మిషన్ మంజూరు కోరుతూ దరఖాస్తులు అందజేశారు. అలాగే జాడుపల్లి చెందిన గాయత్రి కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని, మల్లి గ్రామానికి చెందిన సవర వెంకటరావు ఆర్థిక సహాయం అందించాలని, మాలువ కాలనీకి చెందిన రత్నాలు గొర్రెల రుణం ఇప్పించాలని వినతులను ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, డిడి మంగవేణి ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ఎస్.సింహాచలం, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, సిడిపిఒ రంగలక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్



సీనియర్ సిటిజన్లకు అండగా ఉందాం

ప్రజాశక్తి - బెలగాం

సీనియర్ సిటిజన్ల రక్షణకు అండగా ఉందామని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమంపై జిల్లాస్థాయి కమిటీ మొదటి సమావేశం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను గౌరవించాలి, వారికి రక్షణగా నిలవాలి, వారికి అవసరమగు సదుపాయాలు కల్పించాలని అన్నారు. సీనియర్ సిటిజన్ల జీవితం సాఫీగా సాగాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెల వారీ జీవనానికి ఎటువంటి ఆటంకాలు ఉండరాదని వారి నిర్వహణకు అవసరమైన అన్ని వనరులు సమకూరాలని ఆయన స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్ల హక్కులు పరిరక్షించాలని చెప్పారు. జిల్లాలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన కేసులు, తల్లిదండ్రుల ఆస్తులు అన్యాక్రాంతం చేసిన కేసుల అర్జీలు అందాయన్నారు. వీటిపై రెవెన్యూ డివిజనల్ అధికారి తక్షణం చర్యలు చేపట్టి ఆస్తులను అప్పగించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులకు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సహకారం అవసరమన్నారు. కార్యాలయాల్లో సీనియర్ సిటిజన్లకు స్నేహపూరిత వాతావరణం ఉండాలని ఆయన ఆదేశించారు. దేవాలయాలు ఇతర ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూ - లైన్లు ఉండాలని, పోలీస్ పెట్రోలింగ్‌లో సీనియర్ సిటిజన్లు ముఖ్యంగా ఒంటరిగా ఉండే గృహాలు తదితర అంశాలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్లను గౌరవించడం, వారి హక్కులను రక్షించడం మన బాధ్యత అని ఆయన అన్నారు. సీనియర్ సిటిజన్, రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ మంచు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన సమావేశంలో అన్ని దేవాలయాల్లో ప్రత్యేక క్యూ - ఉండాలని, తల్లిదండ్రులను బాధ్యతగా చూడని కుమారులపై చర్యలు తీసుకోవాలని చర్చించామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు పి.కిరణ్‌కుమార్, కె.రామచంద్ర రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, సీనియర్ సిటిజన్లు గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన కళాకృతుల ప్రదర్శన మేళాను పరిశీలిస్తున్న జిసిసి ఎండి సురేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ఉత్పత్తులకు ట్రైఫాడ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించబడుతుందని జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం సీతంపేట ఐటిడిఎలో నిర్వహించిన గిరిజన కళాకృతుల ప్రదర్శన మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేటలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. సీతంపేటలో విడివికెలు చాలా బాగా పనిచేస్తున్నాయన్నారు. గిరిజన ఉత్పత్తులు కూడా చాలా బాగున్నాయన్నారు. సీతంపేట ప్రాంతంలో తయారయ్యే గిరిజన ఉత్పత్తులకు రాష్ట్రంలో మంచి డిమాండ్ ఉందన్నారు. విడివికెలకు జిసిసి తరపున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఐటిడిఎ పిఒ కల్పనకుమారి మాట్లాడుతూ విడివికె సభ్యులు భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా తయారవ్వాలన్నారు. మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. తయారుచేసే గిరిజన ఉత్పత్తులు నాణ్యతతో ఉండాలన్నారు. ఐటిడిఎ నుంచి పూర్తి సహకారం అందేలా చర్యలు తీసుకొంటామని అన్నారు. ట్రైఫాడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ శాంకే మాట్లాడుతూ సీతంపేట గిరిజన ఉత్పత్తుల తయారీ విధానం బాగుందని, ఉత్పత్తులకు ప్యాకేజింగ్ చాలా బాగుందని అన్నారు. ట్రైఫాడ్ నుంచి మార్కెటింగ్ సౌకర్యం కలిగేలా అన్ని రకాల చర్యలు తీసుకొంటామన్నారు. దేశంలో అన్ని నగరాల్లో ఇటువంటి మేళాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మేళాలో వివిధ పాఠశాలల నుంచి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, వెలుగు ఎపిడి రమణ, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, ఎఎంఒ పి.కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఆహార భద్రతా కమిటీ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఆహార భద్రత కమిటీ సభ్యులు బి.కాంతారావు జిల్లాలో మంగళ వారం పర్యటిస్తారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని చెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వాహించిన అనంతరం వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొంటారన్నారు.

ఎన్నో ఏళ్ల కల ఫలించిన వేళ...

కలెక్టర్ చొరవతో మాజీ సైనికునికి ఉపశమనం

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని పెదభోగిల గ్రామంలో మాజీ సైనికుడు మరడా అప్పారావుకు చెందిన 4.03 ఎకరాల విస్తీర్ణంలోని భూమిపై ఎన్నో ఏళ్లుగా 1బి సమస్య నడుస్తోంది. సరైన పరిష్కారం లేక ఎదురు చూస్తున్న తరుణంలో సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన జగనన్న కు చెబుదాం కార్యక్రమంలో అప్పారావుకు శాశ్వత పరిష్కారం లభించింది. అప్పారావు తనకు కేటాయించిన భూమిని క్రయ విక్రయాలు చేసుకునే విధంగా అవకాశం కల్పిస్తూ అభ్యంతరకర భూముల జాబితా నుండి తొలగించారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా వెబ్ లాండ్‌లో అసైన్డ్ భూమిగా, అనాదీన మెట్టగా వర్గీకరణలో కనిపించింది. జిల్లా కలెక్టర్ చేతికి అందిన వెంటనే అక్కడికక్కడే సాంకేతిక సమస్యను పరిష్కరించి పూర్తి హక్కులు పొందే విధంగా చేశారు. కలెక్టర్ చొరవతో శాశ్వత పరిష్కారం లభించిందని అప్పారావు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మక్కువ మండలం శంబరకు చెందిన తీళ్ల అన్నపూర్ణమ్మ (భర్త లేటు శ్రీరాములు) ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేని భూ సమస్య అని, తనకు చెందిన సర్వే నెంబరు 129 - 2ఎ లో 1.62 ఎకరాల భూమిలో 12 సెంట్ల జిరాయితీ భూమి బూర్జ రెవెన్యూ రికార్డులు 22ఎ లోకి పొరపాటుగా వెళ్లింది. వాటిని సరిచేయాలని ఆమె పలుమార్లు అర్జీలు చేసుకున్నారు. అయినప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆమె జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కు తన సమస్యను తెలిపారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ భూ రికార్డులను పరిశీలించి, జిల్లా రిజిస్ట్రార్‌తో మాట్లాడి ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.

కుష్టురోగుల భూములపై ప్రభుత్వం కన్ను

ప్రజాశక్తి-బొబ్బిలి

కుష్టు రోగుల భూములపై ప్రభుత్వం కన్ను పడింది. 1961లో కుష్టు రోగుల కోసం 12.60 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రభుత్వం కేటాయించిన కొంత భూమిలో ఇళ్లు నిర్మించుకుని ఆ కాలనీకి ప్రేమనగర్ కాలనీగా నామకరణం చేశారు. ప్రేమ సమాజం లెప్రసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. కుష్టు రోగులు పనులు చేసుకునే అవకాశం లేకపోవడంతో పట్టణంలో భిక్షాటన చేసుకుని ఆ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. ఖాళీగా ఉన్న 4.71 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయడంతో కుష్టు రోగులు, ప్రేమనగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐటిఐ కాలనీకి ఎదురుగా 12.60 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తే, కొంత భూమిలో కుష్టు రోగులు ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన భూమి ఇతర అవసరాలకు రిజర్వ్‌గా ఉంచారు. ప్రేమనగర్‌కాలనీ వద్ద మల్లమ్మపేట రెవెన్యూలో సర్వే నంబర్ 218-ఎలో 4.71 ఎకరాలు ఖాళీగా ఉంది. కొన్నేళ్లుగా ఆ భూమి ఖాళీగా ఉండడంతో బుడా ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రీయ రహదారి పక్కనే భూమి ఉండడంతో పెట్రోల్ బంకు ఏర్పాటుకు బుడా ప్రతిపాదనలు చేయడంతో కౌన్సిల్ తీర్మానం చేసేందుకు మున్సిపల్ సమావేశంలో అజెండా పెట్టారు. కానీ, ఆ వార్డు కౌన్సిలర్ తెంటు పార్వతి వ్యతిరేకించడంతో తీర్మానాన్ని ఆమోదించకుండా వాయిదా వేశారు. దీంతో ఖాళీగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలని అధికార పార్టీ నాయకులు రెవెన్యూ అధికారులకు సూచించారు. సర్వే చేసిన అధికారులు ఖాళీగా ఉన్న 4.71 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు అక్కడ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నాలుగేళ్లలోపు ఎటువంటి నిర్మాణాలూ చేయకపోతే వెనక్కి తీసుకునే హక్కు ఉండడంతో ఆ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు.

17.5 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- పాచిపెంట

మండలం పి.కోనవలస వద్ద సోమవారం ఎస్సై ఫక్రుద్దీన్ 17 కేజీల 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా ఒడిశా నుండి గుర్తు తెలియని వ్యక్తి అక్రమంగా 17 కేజీల 600 గ్రాముల గంజాయిని బ్యాగులో పెట్టుకొని వస్తున్నాడు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండడాన్ని గమనించి, అక్కడే గంజాయిని విడిచి పారిపోయాయి. ఆ వ్యక్తిని పట్టుకొనేందుకు పోలీసులు బృందాలు ఏర్పడి తనిఖీలు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గొట్టివలస రైతులు

భూ బదలాయింపుపై నిరసన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గొట్టివలస రైతులు తమ భూములను అటవీశాఖకు బదలాయించే చర్యకు నిరసనగా ఆందోళన నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర మాట్లాడుతూ గొట్టివలస రెవెన్యూ పరిధిలోని 272, 273, 274 సర్వే నెంబర్లలో సుమారు 34 మందికి పట్టాలను 2008లో మంజూరు చేశారని నాటి నుండి నేటి వరకూ ఆ భూమిని రైతులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ భూమికి సంబంధం లేని 279 సర్వేనెంబర్ లోని భూమిని అటవీ శాఖకు ఇస్తున్నట్టు నివేదిక రూపొందించిన రెవెన్యూ అధికారులు 272, 273, 274 సర్వే నెంబర్ల పరిధిలో పట్టాలు పొంది సాగులో ఉన్న రైతులను భూముల నుండి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం రైతులకు సమాచారం ఇవ్వకుండా రైతులు అనుమతి లేకుండా ఏ నిబంధన ప్రకారం అటవీ శాఖకు బదిలీ చేసారని ప్రశ్నించారు. రైతులను మభ్య పెట్టి తప్పుడు సర్వే నంబర్లు సృష్టించి అడ్డగోలుగా రైతులను భూముల నుండి తొలగించే చర్యలను అంగీకరించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం నిబంధనలు పాటించాలని నిబంధనలకు విరుద్ధంగా పేద రైతులను భూముల నుండి వెళ్ళగొట్టే ప్రయత్నాలను ఉపసంహరించుకోకపోతే రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం రైతుల వద్ద ఉన్న పట్టా దారు పాసుపుస్తకాలతో సహా ఆధారాలను ఉప తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు బోను శంకర్రావు, నాగభూషన్ రావు తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రాలను స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

జనరేటర్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - బెలగాం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ వసతి గృహాల్లో రాత్రి వేళల్లో చిన్నపాటి గాలి వర్షం వచ్చినా రాత్రింతా కరెంట్ లేకపోయింది. దీనివల్ల విద్యార్థులకు చదువుతో పాటు క్రిమికీటకాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని కావున జనరేటర్లు ఏర్పాటు చేయాలని ఐటిడిఎ పిఒకు ఆదివాసీ గిరిజన అభ్యుదయ, గిరిజన సమాఖ్య, ట్రైబల్ రైట్ ఫోరం సంఘాలు కోరారు. దీనికి పిఒ స్పందించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో సంఘాల నాయకులు ఆరిక చంద్రశేఖర్, దుక్క సీతారాం, ఇంటికుప్పల రామకృష్ణ, కోలక గౌరమ్మపాలకొండ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి నగిరెడ్డి నాగభూషణరావు అన్నారు. మండల విద్యాశాఖ పరిధిలోని నవిరిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పనితీరును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనం పథకం అమలును పరిశీలించడంతో పాటు వంటలను రుచి చూశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూ అమలు చేయాల్సిందేనని పేర్కొన్నారు. విద్యార్థులకు రోజువారీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం భోజనం వండిపెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందిస్తున్న జ్యోతి ఐటిఐ కరస్పాండెంట్ మురళి

జాబ్‌మేళాలో 61 మంది ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ శివారులోని జ్యోతి ఐటిఐలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేషస్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు 160 అభ్యర్థులు హాజరు కాగా, 61మంది ఎంపికైనట్లు జ్యోతి ఐటిఐ సంస్థ కరస్పాండెంట్ కోయిలాడ మురళి తెలిపారు. తోషిబా ప్రైవేట్ కంపెనీ ఇంటర్వ్యూలు ఇంటర్వ్యూలు నిర్వహించరన్నారు. ఈ ఇంటర్వ్యూల్లో ఎలక్ట్రానిక్, ఫిట్టర్ గ్రూపుల అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు మురళి తెలిపారు. కార్యక్రమంలో తోషిబా కంపెనీ ప్రతినిధి, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

ఈ ఏడాది డిసెంబర్ 3న వికలాంగుల దినోత్సవం జిల్లా స్థాయిలో అన్ని మండలాల వికలాంగుల సంఘాలను కలుపుకొని ఘనంగా నిర్వహించాలని జిల్లా వికలాంగుల పరిరక్షణ సమితి ముఖ్య సలహాదారు శంబంగి భాస్కరరావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా వికలాంగుల పరిరక్షణ సమితిని గుర్తించి ఇకపై జిల్లా స్థాయిలో ప్రభుత్వం నుంచి అన్ని కార్యక్రమాలకు సమాచారాన్ని అందించాలని కలెక్టర్ కోరినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో వికలాంగులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించి ప్రోత్సహించాలని కోరారు. సీతానగరం మండలం బురద గ్రామానికి చెందిన వికలాంగురాలు కోట గౌరమ్మకు తొలగించిన పింఛన్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఉన్న ప్రతి పాఠశాలలో కూడా రికార్డులను సక్రమంగా నిర్వహించేలా ప్రధాన ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని స్థానిక స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్, ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు తెలిపారు. సోమవారం స్థానిక చింతలగూడ వీధిలో ఉన్న ఎయిడెడ్ ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను, సెనగ చెక్కిలు, రాగిజావకు సంబంధించిన స్టాకు రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న కోడి గుడ్లను చక్కగా పరిశీలించి విద్యార్థులకు అందించాలని అన్నారు. ఎఫ్ఎ-2 పరీక్షలకు సంబంధించి పరీక్ష పత్రాలను దిద్ది రికార్డులలో నమోదు చేసి విద్యార్థులకు మార్కులను తెలియపరచాలని అన్నారు. ఈయన వెంట సిఆర్‌పి సింహాచలం, పాఠశాల మేనేజర్ బేత కృష్ణమూర్తి నాయుడు, ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, వాలంటీర్లు సునీత, ప్రశాంతి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఫారెస్టు రేంజ్ అధికారి తవిటినాయుడు

పర్యావరణాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి - పాలకొండ

పర్యావరణాన్ని పరిరక్షించాలని, వన్యప్రాణులను కాపాడాలని ఫారెస్టు రేంజ్ అధికారి కె.తవిటినాయుడు విద్యార్థులకు సూచించారు. వన్యప్రాణి వారోత్సవాలు సందర్భంగా సెక్షన్ బీట్ ఆఫీసర్ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వెంకంపేట ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎఫ్ఆర్ఒ మాట్లాడుతూ పరిసరాలతో పాటు పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అడవులు అంతరించుకుపోవడంతోనే వన్యప్రాణులైన ఏనుగులు, పులులు మైదాన ప్రాంతాల్లోకి వస్తున్నాయన్నారు. వన్యప్రాణులు ఎదురైన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.పరాంకుశంనాయుడు, అటవీ అధికారులు రవిబాబు, కె.నీలవేణి, కె.రాజ్యలక్ష్మి, కె.దాలినాయుడు, కుసుమకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడు రోజులే

- మూతపడ్డ ప్రత్యామ్నాయ పాఠశాల
- విద్యకు దూరమవుతున్న గిరిపుత్రులు

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యాశాఖకు అధిక శాతం నిధులు కేటాయించడంతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తుందే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. ఈ కారణంగా గిరిపుత్రులు విద్యకు దూరమవుతున్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు (ఎన్ఆర్ఎస్‌టిసి) ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా శాఖ విద్యాశాఖ అధికారులు మండలంలోని గాదిలంక గిరిజన గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాలను గుర్తించి పాఠశాల నిర్వహణకు చర్యలు చేపట్టారు. గిరిజన తండాలో కిలోమీటరు దూరంతో పాటు అందుబాటులో పాఠశాల లేకపోతే ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశం. ఇక్కడ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 18మంది విద్యార్థులు విద్యను అభ్యసించేవారు. వీరికి అన్ని పాఠశాలల వలె పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం సదుపాయంతో పాటు వాలంటీర్‌ను కూడా నియమించారు. అప్పట్లో ఈ పాఠశాల విద్యార్థులు సామర్థ్యం ఏవిధంగా ఉందా అని డిఇఒ ఎస్‌డివి రమణ పరిశీలించి, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని



పాఠశాలను పరిశీలిస్తున్న డిఇఒ (ఫైల్)

వాలంటీర్‌ను ఆదేశించారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యామ్నాయ పాఠశాలలపై ఆసక్తి చూపకపోవడంతో ఇక్కడి పాఠశాలను ఎత్తివేశారు. దీంతో కిలోమీటరు దూరంలో ఉన్న మూలలంకలో ఉన్న పాఠశాలకు వెళ్లలేక పలువురు చిన్నారులు అంత దూరం నడవలేక ఇళ్లకే పరిమితమయ్యారు. తమ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో పిల్లలు అర్ధాంతంగా చదువులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే అధికారులు స్పందించి తమ గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేసి తమ పిల్లలను విద్యను అందించాలని ఈ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

గౌరవ వేతనం అందక అవస్థలు

మండలంలోని గాదిలంకతో పాటు మరో 11ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పాఠశాలల నిర్వహణ కొనసాగించినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పాఠశాలలో వాలంటీర్లకు ఇచ్చే గౌరవవేతన రూ.7,500 గాదిలంక వాలంటీర్‌కు అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో పనిచేసే వాలంటీర్లకు గౌరవవేతనం అందినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే దాదాపు 14 నెలలు కావస్తున్నా ఇంతవరకు గౌరవవేతన అందలేదని వాలంటీరు చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక విద్యాశాఖ అధికారి ఆర్.ఆనందరావు వద్ద 'ప్రజాశక్తి' సోమవారం ప్రస్తావించగా వాలంటీరుకు గౌరవ వేతనం అందలేదని వాస్తవమేనని, ఈ విషయాన్ని జిల్లా స్థాయి ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరణ ఇచ్చారు.


ఇకెవైసి పరిశీలిస్తున్న జెడి రాబర్ట్‌పాల్

ఇకెవైసి పరిశీలన

సీతానగరం : మండలంలోని నిడగల్లు, నీలకంఠాపురం, వెంకటాపురం గ్రామాలలో జరుగుతున్న ఇకెవైసిని సోమవారం వ్యవసాయ శాఖ జెడి రాబార్ట్‌పాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలతో పంటలు అమ్ముకునేందుకు వీలుగా ఇకెవైసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎస్ అవినాష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు తనిఖీలు

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి పి. ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తుతోపాటు తదితరమైన తనిఖీలు నిర్వహించి గర్భిణులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయంలో పలు కార్యక్రమాలు

గరుగుబిల్లి : ఈనెల 14నుంచి దసరా సెలవులు సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్థానిక గ్రంథాలయ నిర్వహకులు నల్ల మధుసూధనరావు తెలిపారు. ఇప్పటికే గ్రంథాలయంలో చదవడంమాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈనెల 14నుంచి 24 వరకు దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీటెల్లింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కళ్లకు గంతలతో టిడిపి దీక్షలు

ప్రజాశక్తి- సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లిలో టిడిపి మండల నాయకులు ఆధ్వర్యంలో సోమవారం కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గం రైతు సంఘం అధ్యక్షుడు బూస తవుడు, నాయకులు తాడుతూరి తిరుపతి రావు, మహిళా నాయకులు డొంక కరుణ, భారతి, రాములమ్మ, రామారావు, శ్రీను, సుధాకర్, నిలారావు, చిన్న, మద్దిల కృష్ణ పాల్గొన్నారు

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ, సీతంపేట మండల నాయుకులు ఆధ్వర్యంలో సోమవారం టిడిపి రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. మండల కేంద్రంలో అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్‌టిసెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, టిడిపి మండల అధ్యక్షులు సవరతోట మొఖలింగం, నాయకులు బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో పార్వతీపురం మండలం వెంకటరాయుడు పేటలో నిరసన శిబిరాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట నాయుడు తలకిందులుగా నిలబడి శీర్షాసనం వేసి వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, దొగ్గ మోహన్ రావు, జి రవికుమార్, గొట్టాపు వెంకట నాయుడు, గర్భాపు ఉదయభాను, బర్నాల సీతారాం, కౌన్సిలర్లు టి. వెంకట్రావు, కె నారాయణరావు, బి. గౌరీ నాయుడు, కోలా సరితా, మధు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాలూరు: కళ్లకు గంతులతో నిరసన తెలుపుతున్న నాయకులు

.పాలకొండ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా తంపాటపల్లి, తుమరాడలో మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు ఆధ్వర్యంలో ఇంటి ఇంటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు కార్యక్రమంలో కోట సంగన్నాయుడు, జాడ శ్రీధర్, పొట్నూరు గౌరునాయుడు, బొత్స వెంకటనాయుడు, బొమ్మాలి బాబాజీ, బలగ వెంకటరమణ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్ద కే వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి బి. సత్యనారాయణ అన్నారు. మండలంలో వలసబల్లేరు సచివాలయంలో సోమవారం జరిగిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వైద్య అధికారులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని నర్సిపురంలో ఈనెల 10వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జిజె ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టు ప్రక్కల ఉన్న గ్రామ ప్రజలు స్వదినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీతంపేట : మండలంలో కిండంగి సచివాలయంలో సోమవారం ఎంపిడిఒ కె.గీతాంజలి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ గీతాంజలి మాట్లాడుతూ ఏడు రకాల వైద్య పరీక్షలు 117 రకాల మందులు ఉన్నాయ న్నారు. గిరిజన ముంగిట్లోకే వైద్యం వచ్చిందని, దీన్ని వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారి రవీంద్ర కుమార్ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని ఎంపిపి కుంబిరిక దీనమయ్య అన్నారు. మండలంలోని డుమ్మంగి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దీనమయ్య, సర్పంచి పాలక క్రాంతికుమార్ ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వైద్యులు బుద్దేశ్వర రావు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని నీలానగరంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పి ఉమామహేశ్వరి, ఏ మానస, వెంకటరమణ తదితరులు ఆరోగ్య తనిఖీలు నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తంనాయుడు, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, సచివాలయ, వైద్య సిబ్బందితో పాటు గ్రామ వాలంటీరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలంలోని కురుకుట్టిలో సోమవారం వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, సర్పంచులు అప్పారావు, ఆదయ్య, నూకయ్య, ఎంపిటిసి సుబ్బారావు, తొనం పిహెచ్‌సి వైద్యులు సుజాత, సచివాలయం, అంగన్వాడి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట: రాష్ట్రంలో పేదల ముంగిటికే ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్న ఘనత సిఎం జగన్ మోహన్‌రెడ్డిదేనని ఎంపిపి బి.ప్రమీల పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఖరీదైన వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వం ఆలోచన అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బాబ్జీ, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, మజ్జి వెంకట్రావు, మీసాల చంటి, మర్రి ఉమా, పాచిపెంట శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, ఎంపిడిఒ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.


వినతి పత్రమిస్తున్న గ్రామస్తులు

తాగునీరు లేక అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

గత నెల రోజులుగా తాగునీటి కోసం చాలా అవస్థలు పడాల్సి వస్తుందని మండలంలోని దబ్బగడ్డ పంచాయతీ పరిధిలోని నాగుల్లు, దబ్బగడ్డ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కేంద్రంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన ఎంపిడిఒ సూర్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని అక్కడే ఉన్న ఎంపిపి మర్రి పారమ్మను కూడా ఈ సందర్భంగా కలిసి విజ్ఞప్తి చేశారు గ్రామంలో ఎనిమిది కొలాయి పాయింట్లు ఉన్నప్పటికీ తాగునీరు రాక బోసిపోయి దర్శనమిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన యువకులు వెంకట్ ప్రభాకర్ తదితరులు కోరారు.

శాఖల సమన్వయంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని వివిధ శాఖల సమన్వయం చేసుకుని పనిచేస్తేనే మండలాభివృద్ధి జరుగుతోందని డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి అన్నారు. సోమవారం భామిని వైకెపి కార్యాలయంలో ఎంపిడిఒ జి. చంద్రరావు ఆధ్వర్యంలో సంకల్ప్ సప్తహ్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ మండలం విద్యా పరంగా ముందంజలో వుందని ఇంకా డ్రాపౌట్ లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని, పిల్లలుకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారని, నాడు -నేడు ద్వారా పాఠశాలలో మెరుగైన స్థాయిలో మౌలిక వసతులు ఏర్పడ్డాయని అన్నారు. వ్యవసాయ శాఖ పరంగా ఈ -క్రాప్, రైతులుకు అందిస్తున్న సేవలు గురించి వ్యవసాధికారి తెలిపారు. వారం రోజులు పాటు సంకల్ప్ సప్తహ్ కార్యక్రమంలో వివిధ స్టాల్ ఏర్పాటు, కార్యక్రమంలో చురుగ్గా వ్యవహరించిన మండల స్థాయిలో వివిధ శాఖలకు చెందిన 12 మంది ఉద్యోగులుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి మంగవేణి, ఎంపిపి తోట శాంతికుమారి, ఎపిఎం దొడ్ల భవాని, ఎపిఒ తులసీదాస్, పంచాయతీ సెక్రటరీ ఎం.మహేంద్ర, ఐసిడిఎస్ పిఒ శాంతి భవాని, డాక్టర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగిని సత్కరిస్తున్న అధికారులు

పిహెచ్‌సిలో ప్రసవాలకు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన డోకిశీల పిహెచ్సిలో గర్భిణులకు నిర్వహించిన పిఎంఎస్ఎం (పిఎంఎస్ఎ) కార్యక్రమాన్ని సోమవారం తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, ల్యాబ్ పరీక్షలు పరిశీలించారు. ఎమ్‌సిపి కార్డులు, రికార్డులు తనిఖీ చేసి అందులో నమోదు చేసిన ఆరోగ్య వివరాల నివేదికలను పరిశీలించారు. రక్తహీనతగా గుర్తించిన గర్భిణులకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణులతో డిఐఒ మాట్లాడుతూ ప్రతి రోజూ ఐరన్, కాల్షియం మాత్రలు వేస్తున్నారా, వైద్య సిబ్బంది గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేస్తున్నారా, అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నమోదైన గర్భిణులకు పూర్తి స్థాయిలో ల్యాబ్ పరీక్షలు జరుగుతున్నాయా అని తనిఖీ చేశారు. ఇంతవరకు గుర్తించిన హై రిస్క్ గర్భిణులతో పాటుగా కొత్తగా తనిఖీలో ఎంత మంది గర్భిణీల్లో హైరిస్క్ ను గుర్తించారని వైద్యాధికారులను అడిగారు. వీరికి అవసరమైన చికిత్స పక్కాగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేసి వారి ఆరోగ్య పరిశీలన చేయాలని ఆదేశించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉన్న గర్భిణుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం వార్డులో ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు తీసుకుంటున్న గర్భిణులను సందర్శించి హిమోగ్లోబిన్ శాతాన్ని రిపోర్టులో పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.నిహారిక, జి. శిరీష, సూపర్ వైజర్స్ శ్రీనివాసరావు, ఎస్. జయ, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


రోగితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు


గ్రామదర్శిని ప్రజా చైతన్య అవగాహన

సీతంపేట: మండలంలోని కొత్తవలస, పెదరామ, ఉప్పర జమ్మి, సీతంపేట, రామనగరంలో ఆదివారం రాత్రి మన్య ప్రగతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు, సంస్కృ - సంప్రదాయాలు, గ్రామాలాభివృద్ధి మానవ సంబంధాలు పై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమం' నిర్వహించారు. మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవికుమార్ గ్రామదర్శిని ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని ఆ పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. అనంతరం సీతంపేటలో జరుగుతున్న గిరిజన సంస్కృతి -సంప్రదాయ వారసత్వ వరాలైనా సందెమ్మ ఊజ్జుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. పెదరామ గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు, గేదెల కాంతారావు తల్లి మరణించిన విషయాన్ని తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు.

బోరు పనులు ప్రారంభం

కురుపాం: మండలంలో జి.శివడ పంచాయతీకి మంజూరైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో డెప్పిగూడ గిరిజన గ్రామానికి తాగునీటి బోరు పనులను సర్పంచ్ బి.మిన్నారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి మంజూరైన రూ.40 లక్షలు గడపగడపకు నిధులతో డెప్పిగూడ, కించాయిగూడ, డోకులుగూడ, ఇప్పమానుగూడ, చింతమానుగూడ, జి.శివడ గ్రామానికి రూ.20 లక్షలు తాగునీటి పథకాలకు కేటాయించామని అన్నారు. మరో రూ.20 లక్షలు మిగతా గిరిజన గ్రామాలకు సిసి రోడ్లు, డ్రైన్లకు కేటాయించడం జరిగిందన్నారు. పంచాయతీలో ప్రతి గ్రామానికి ఇంటింటికీ తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నానని గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలుంటే ప్రజలు నా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో సచివాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ బి. మిన్నారావు


మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయుల జీవితాలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవు బకాయిలు స్కూలు గ్రాంటు, ఎంఆర్‌సి సిబ్బంది సిఆర్‌పిల జీతాల జిపిఎస్ రద్దు కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అన్నారు. మండలంలోని తాలవరం, పనస నందివాడ, ఎంవిపురం, కుమ్మరిగుంట, నీలానగరం, బిటివాడ, వండువ, చిదిమి, పాలమెట్ట, డిపి వలస, సిబిఎం వలస, ఆడారు, పాపంపేట, బొడ్లపాడు, తూడి, ఎం.రాజుపురం, యు.వెంకంపేట, కత్తుల కవిటి, రేగులపాడు, హుస్సేన్‌పురం, తదితర పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్షులు బి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.గోవిందరావు, సీనియర్ నాయకులు ఎస్.మహేష్, ఎ.స్వామిబాబు, కె.గౌరునాయుడు, ఎ.చంద్రమోహన్, ఎస్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - బెలగాం

గిరిజన బాలికల గురుకులాలో సెక్యూరిటీ గార్డులను యథావిధిగా కొనసాగించాలని సెక్యూరిటీ గార్డు ఉద్యోగులు, సంఘాల నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతిని అందజేశారు. గతంలో గిరిజన సంక్షేమ విద్యా సంస్థలో భద్రత, సురక్షితమైన జీవన వాతావరణ కల్పించడానికి ఆశ్రమ పాఠశాలలో ఇతరులకు ప్రవేశాన్ని నిషేధిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆప్కాస్ సంస్థల ద్వారా గిరిజన గురుకుల, ఏకలవ్య సంస్థల్లో విద్యార్థుల రక్షణ కోసం సెక్యూరిటీ గార్డుల నియామకాలు చేపట్టారు. కావున ప్రస్తుతం తమను కొనసాగించాలని వారు కోరారు. వినతిని అందజేసిన వారిలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలో ద్వారపురెడ్డి రామమోహన్‌రావు పామాయిల తోటలో పనిచేస్తున్న చిట్టిబోయిన అప్పారావు అనే వ్యక్తి ప్రతీ రోజులాగే కరెంట్ మోటారు వేసేందుకు వెళ్లి సోమవారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. మోటారు వేయగా దాని దగ్గర ఉన్న స్టాటర్‌ను ప్రమాదవాసాత్తు పట్టుకున్నాడు. దీంతో షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్.ఐ ఎం. రాజేష్ తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.


మృతి చెందిన అప్పారావు